పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సెక్టోరియల్ అధికారి, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాల తనిఖీ

న్యాల్‌కల్, అక్టోబర్ 19 : మండలంలోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు తనిఖీ చేశారు. గురువారం మండలంలోని రాఘవపూర్, ఇబ్రహీంపూర్, చాల్కి, న్యాల్‌కల్, మెటల్‌కుంట, మామిడ్గి, రేజింతల్, చీకూర్తి, మల్గి, డప్పూర్, మిర్జాపూర్(బి) తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఓటర్లు, ఎన్నికల అధికారులకు అవసరమైన మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. వృద్ధులు, దివ్యాగులు ఓటర్లు కేంద్రాలకు వచ్చేందుకు అనుకూలంగా ఉన్నాయా..? లేదా అనే విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు వెంకట్‌రెడ్డి, లావణ్య, రవీందర్, కృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేయవచ్చు

రాయికోడ్,అక్టోబర్ 19 : వచ్చే నెల 30న నిర్వహించనున్న ఎన్నికల్లో 80ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చని జహీరాబాద్ డీఎల్‌పీవో రాఘవరావు తెలిపారు. గురువారం రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శుల, మండల ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లుకు ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రంలో వారం ముందుగానే డీ-12 ఫారం అందజేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశం, ఇన్‌చార్జి ఎంపీవో రాజేందర్ ఉన్నారు.

నేడు కిషన్‌నాయక్ తండాలో సమావేశం

సిర్గాపూర్, అక్టోబర్ 19: మండలంలోని బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సమావేశమై కార్యక్రమాలపై చర్చించారు. శుక్రవారం ఉదయం 11గంటలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ముఖ్యకార్యకర్తలతో సమావేశమై అభివృద్ధి, వచ్చే ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

గోసాయిపల్లి నుంచి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

మండంలోని గోసాయిపల్లి గ్రామం నుంచి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని అధ్యక్షుడు సంజీవరావు తెలిపారు. ఉదయం 9గంటలకు స్థానిక గుట్టపైన మహాదేవుని ఆలయంలో పూజలు జరిపి ప్రచారం మొదలు పెడతారన్నారు. ఆ తర్వాత మండలంలోని సంగం, చీమల్‌పాడ్, గౌడ్‌గాం, కిషన్‌నాయక్‌తండాలో ఎన్నికల ప్రచారంలో పార్టీ మేనిఫెస్టో, సంక్షేమాభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రజలకు వివరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్, సోషల్ మీడియా అధ్యక్షుడు రమేశ్, దేవేందర్, ధర్మానాయక్, డీలర్ రమేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించాలి

మునిపల్లి,అక్టోబర్ 19: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు అర్థం అయ్యే విధంగా ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి మంతురి శశికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని బుసారెడ్డిపల్లిలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించి బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు అర్థం అయ్యే విధంగా వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు నమ్మొద్దని చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై క్లుప్తంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



బుసారెడ్డిపల్లి సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

- జోగిపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ
- తీరొక్క పూలతో బతుకమ్మలు
- ఆడి పాడిన మహిళలు, యువతులు

అందోల్ : జోగిపేటలో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళాలు

అందోల్, అక్టోబర్ 19: నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, యువతులు పెద్ద ఎత్తున్న ఉత్సవాల్లో పాల్గొని ఉల్లాసంగా ఆడి పాడారు. తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమైన బతుకమ్మను మహిళలు సహజసిద్ధమైన పూలతో తయారు చేసుకుని రాగా, జోగిపేట పట్టణవీధులు పూలవనాలను తలపించాయి. పిల్లలు, పెద్ద లు నూతన వస్త్రాలు ధరించి.. అందంగా పేర్చిన పూల బతుకమ్మను ఒక చోటుకు చేర్చి పాటలు పాడుతూ ఆటలాడారు. బతుకమ్మ వేడుకలు ముగిసిన అనంతరం చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేసి ఒకరికొకరూ పసుపు, కుంకుమతో వాయినాలు ఇచ్చుకున్నారు. అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య కౌన్సిలర్లు ఉత్సవాల నిర్వాహణకు కావాల్సిన ఏర్పాట్లు చేసి వేడుకల్లో పాల్గొన్నారు.

మిర్జాపూర్(బి) ఆరోగ్య కేంద్రంలో..

న్యాల్‌కల్, అక్టోబర్ 19 : మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది కలిసి రకరకాల పూలతో అందంగా బతుకమ్మను తయారు చేశారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో బతుకమ్మలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నృపేన్ చక్రవర్తి, వైద్య సిబ్బంది శ్యామల, శంకరమ్మ, శివకుమారి, పుణ్యవతి, లలిత, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి : చిన్నచెల్మడలో అంగన్‌వాడీలో బతుకమ్మ సంబురాలు

న్యాల్‌కల్ : మిర్జాపూర్(బి) ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ పెట్టి పాటలు పడుతున్న వైద్యాధికారులు, సిబ్బంది

అందోల్ : జోగిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళాలు, యువతులు

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

కంగ్టి, అక్టోబర్ 19: కంగ్టితో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కంగ్టి, దెగుల్‌వాడీ గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల వద్ద ప్రతిరోజు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం, రాత్రి వేళలో హారతి చేపడుతున్నట్లు తెలిపారు. దసరా మరుసటిరోజు దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేయనున్నామన్నారు.

శ్రీలలితా దేవిగా - ముమ్మాదేవి అమ్మవారు

రాయికోడ్, అక్టోబర్ 19: రాయికోడ్‌లోని ముత్యాలవాడలో ఉన్న ముమ్మాదేవి ఆలయంలో శ్రీదేవి నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ముమ్మాదేవి ఆలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఐదో రోజు లలితదేవిగా దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు..

మనూరు, అక్టోబర్ 19 : దేవి నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. బోరంచ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో దేవి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

నాగల్‌గిద్ద, అక్టోబర్ 19 : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు, తండాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వెలిసిన అమ్మవారి మండపాల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

బోరంచలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎన్నికల సమన్వయకర్తగా శంకర్‌నాయక్

జహీరాబాద్, అక్టోబర్ 19 : జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ గిరిజన తండాల ఎన్నికల ప్రచార సమన్వయకర్తగా సజ్జారావుపేట తండా సర్పంచు, టెలికం బోర్డు సభ్యులు పవార్ శంకర్‌నాయక్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్‌రావు నియమక పత్రం అందజేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పవార్ శంకర్ నాయక్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాణిక్‌రావు గెలుపుకోసం తనవంతు కృషి చేస్తాన్నారు. గిరిజన తండాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాణిక్‌రావు భారీ మోజార్టీ సాధించేందుకు కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఇప్పెపల్లి పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్ ఉన్నారు.

జహీరాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో టెలికం బోర్డు సభ్యుడు పవార్ శంకర్‌నాయక్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు

జోగిపేట ఏంఎసీ చైర్మన్ పల్లె సంజీవయ్యకు సన్మానం

చౌటకూర్, అక్టోబరు 19: మండలంలోని గంగోజిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్యను సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య స్వగ్రామం గొంగ్లూరు గ్రామానికి గురువారం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సంజీవయ్యకు బీఆర్ఎస్ అదిష్టానం సరైన గుర్తింపునిచ్చిందన్నారు. అకింతభావంతో పార్టీ పటిష్టతకు పనిచేస్తూ, నిబద్ధత, నిఖార్సైన నాయకుడిగా పల్లె సంజీవయ్య గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. పార్టీ విధేతయతకు కట్టుబడి పని చేసిన వారెవరికైనా అధిష్టానం గుర్తింపునిస్తుందని పల్లె సంజీవయ్య అన్నారు.